క్లుప్తంగా

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన



సంగం: మండల పరిషత్ కార్యాలయంలోని కుట్టు శిక్షణా కేంద్రాన్ని బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి గురువారం పరిశీలించారు. కుట్టు శిక్షణ అందిస్తున్న తీరును మహిళలను అడిగి తెలుసుకున్నారు. కుట్టు శిక్షణకు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు కుమ్మరి, మేదర కులాలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జనరిక్ మెడికల్ దుకాణాల ఏర్పాటుకు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఎంపీడీఓ షాలెట్ పాల్గొన్నారు.

పరామర్శ



కావలి: పట్టణంలోని 3వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రగుంట చంద్రశేఖర్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కానిస్టేబుల్ మృతి



కావలి: కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సూరిశెట్టి రమేష్ (37) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో మరణించారు.

పూరిల్లు దగ్ధం



కొండాపురం : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన కొమ్మి పంచాయతీ పరిధిలోని రామానుజపురంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బండ్ల మూడి మధు పూరింట్లో జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల పెళ్లికి వెళ్లాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు వస్తుండడాన్ని స్థానికులు గమనించి మధుకు సమాచారం అందజేసి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లోని గృహోపకరణాలు, రూ.20వేల నగదు, రేషన్, ఆధార్‌కార్డులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. కొమ్మి వీఆర్వో మహేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి తహసీల్దార్ కోటేశ్వరరావుకు సమాచారం అందజేశారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ. 280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 531 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 429 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సరాసరిన రూ. 258.62 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి నివేశ్‌కుమార్‌పాండే వివరించారు.

డీసీపల్లిలో 483 బేళ్ల కొనుగోలు

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 483 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లుగా వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 689 బేళ్లు రాగా, 483 బేళ్లను కొనుగోలు చేశామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.220, సగటున రూ.256.29 ధర పలికిందని వివరించారు.

పోలేరమ్మ చీరల వేలం

అల్లూరు: స్థానిక పోలేరమ్మ ఆలయంలో అమ్మవారి చీరల బహిరంగ వేలాన్ని గురువారం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను వేలం వేయగా రూ.47,850 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ చిట్టిబాబు తెలిపారు. ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చేతిపంపులను ఏర్పాటు చేయండి సారూ..

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లోని రెండు చేతిపంపులను కావలి-సీతారామపురం హైవే నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మాణ సంస్థ తొలగించింది. ప్రత్యామ్నాయంగా వేరే చోట బోర్లను ఏర్పాటు చేయాల్సిన నిర్మాణ సంస్థ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేతిపంపుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నత్తనడకన జల్‌జీవన్ మిషన్ పనులు

మంచినీటి కష్టాలు తీరాయి



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఈమె పేరు కొండమ్మ. అనంతసాగరం మండలం లింగంగుంట ఎస్సీ కాలనీ. గతంలో దూరంగా ఉన్న చేతిపంపుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకునేవారమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి కుళాయిలు నిర్మించడంతో నీటి కష్టాలు తప్పాయని చెబుతోంది. పనులకు సైతం అనుకున్న సమయానికి వెళ్లగలుగుతున్నామని ఆమె పేర్కొంది.

- ఆత్మకూరు నియోజకవర్గానికి రూ.11758.04 లక్షలు మంజూరు
- గత ప్రభుత్వ హయాంలో ముమ్మరంగా పనులు
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ముందుకుసాగని పనులు
- వేసవిలో తాగునీటికి అల్లాడుతున్న గ్రామీణప్రాంత ప్రజలు



ఆత్మకూరు మండలం మురగళ్లలో అసంపూర్తిగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం



ఆత్మకూరు మండలం రామస్వామిపల్లిలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకు

ఆత్మకూరురూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వ జల్‌జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా వాటర్ ట్యాంకులు, పైపులైన్లు నిర్మాణం చేపట్టి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందించాల్సి ఉంది. అయితే ఆత్మకూరు నియోజకవర్గంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కోట్లాది రూపాయల నిధులు ఉన్నా పనులను పూర్తిచేయడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆత్మకూరు నియోజకవర్గానికి జలజీవన్‌మిషన్ పథకం కింద రూ.11758.04 లక్షలు మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలో యుద్ధప్రాతిపదికన ప్రారంభించిన పనులు కొన్ని గ్రామాల్లో పూర్తయ్యాయి. ఇంటింటికి కుళాయిల ద్వారా మంచి నీటిని అందించి అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. 2020 డిసెంబరు 30న దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన జలజీవన్ మిషన్ పనులను 2024 నాటికి పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో అసంపూర్తిగా ఉండడం విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల రావడంతో పనులను పూర్తిచేయడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఆ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ పనులు ముందుకు సాగడం లేదు. కూటమి ప్రభుత్వం పది నెలల క్రితం రెండో దశ పనులను ప్రారంభిస్తామని, ఏప్రిల్‌లోగా ప్రతి ఇంటికి కుళాయిలను ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఆర్భాటపు ప్రకటనలు చేసినప్పటికీ ఆచరణలో ఆ హామీ నెరవేరకపోవడం వేసవిలో తాగునీటికి ఇబ్బందులుపడే ప్రజల పాలిట శాపంగా మారింది. అరకొరగా గోతులు తీసి పైపులు భూమిలో పూడ్చిపెట్టడం, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిపివేయడం, శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకులు ఇప్పటికీ అదే స్థితిలో దర్శనం ఇవ్వడం జల్‌జీవన్ మిషన్ పథకం ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చి వేసింది. జల్‌జీవన్ మిషన్ పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ క్షేత్ర స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజలకు శాపంగా మారింది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈలను సంప్రదించగా తాగునీటి సమస్య పరిష్కారానికి జలజీవన్‌మిషన్ నిధులు వినియోగించి సత్వర చర్యలు తీసుకుంటామని చెబుతున్నారే తప్ప ఆచరణలో చూపకపోవడంతో ప్రజల తాగునీటి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని బాధిత గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

అనంతసాగరంలో నెరవేరిన లక్ష్యం

ఆత్మకూరు నియోజకవర్గ వ్యాప్తంగా జలజీవన్ మిషన్ పనుల పురోగతిని పరిశీలిస్తే ఒక్క అనంతసాగరం మండలంలోనే లక్ష్యాలను సాధించారని చెప్పొచ్చు. తొలి దశలో వరికుంటపాడులో రూ.25 లక్షలు, శంకర్‌నగరంలో రూ.24లక్షలు, లక్కరాజుపల్లిలో రూ.14 లక్షలు, రేవూరులో రూ.14 లక్షలు, కొత్తపల్లిలో రూ.24 లక్షలు, కొత్తపల్లి వడ్డిపాళెంలో రూ.21 లక్షలు, పాతదేవరాయపల్లిలో రూ.28 లక్షలు, అనంతసాగరంలో రూ.34 లక్షలు, మంచాపల్లిలో రూ.17 లక్షలు, బొమ్మవరంలో రూ.31 లక్షలు, బొమ్మవరం అగ్రహారంలో రూ.38 లక్షలు, సోమశిలలో రూ.14 లక్షలు, ఆమనిచిరివెళ్లలో రూ.25 లక్షలతో మంజూరైన పనులను దాదాపు పూర్తి చేశారు.

జల్‌జీవన్ మిషన్ నిధుల కేటాయింపు

మండలం	పనులు	నిధులు (రూ.లక్షల్లో)
ఆత్మకూరు	124	3231.02
అనుమసముద్రం	84	1148.24
అనంతసాగరం	96	1902.14
చేజర్ల	54	877.35
మర్రిపాడు	128	3268.09
సంగం	69	1331.20

ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలకు శాపం



మా గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. జలజీవన్‌మిషన్ పథకం ద్వారా నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో రెండేళ్ల క్రితం బోరు పాయింట్ వేశారు. కిలోమీటర్ దూరం పైపులైన్లు వేశారు. ఆ తరువాత పనులు నిలిపివేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు.

– కొప్పోలు యల్లారెడ్డి, రామస్వామిపల్లి, ఆత్మకూరు మండలం

తాగునీటి కష్టాలు దూరం



నా చిన్నతనం నుంచి తాగునీటి సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులు రెండేళ్ల క్రితం జగనన్న ప్రభుత్వంలో పరిష్కారమయ్యాయి. అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసిన మంచినీటి పథకం ద్వారా మా కాలనీతో పాటు పరిసరాల్లో ఉన్న ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు సమృద్ధిగా సరఫరా చేస్తున్నారు.

–మంగళ కర్రయ్య, లింగంగుంట, అనంతసాగరం మండలం

ఉపాధ్యాయుడికి సన్మానం



మర్రిపాడు: మండలంలోని చిలకపాడు ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఓవీ రాధాకృష్ణమూర్తిని సహచర ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా రాధాకృష్ణమూర్తి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి



వావిలేరులో అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి

ఆత్మకూరు(చేజర్ల): వరి రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి సూచించారు. చేజర్ల మండలం వావిలేరు రైతుసేవా కేంద్రంలో ఏఓ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు, భూసార పరీక్షలపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సత్యవాణి పాల్గొని మాట్లాడారు. పంట మార్పిడితో భూసారం స్థిరంగా ఉంటుందని తెలిపారు. రెండోకారుకు నీరు విడుదల చేస్తున్న క్రమంలో రైతులు ఆరుతడి పంటలు, కూరగాయలు, పూలతోటల సాగుపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. నెల్లూరు వ్యవసాయ కేంద్రం ఏడీఏ నర్సోజీరావు, పొదలకూరు ఏడీఏ శివనాయక్, సర్పంచ్ రాంబాబు, ఏఓ శ్రీదేవి, వీఏఏ సుజాత, రైతులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని నేలటూరు, కొండయపాళెం గ్రామాల్లో ఏఓ ఆంజనేయులునాయక్ భూసార పరీక్షలు,ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో వరికి బదులు మొక్కజొన్న, వేరుశనగ, అపరాల పంటలు సాగు చేసుకోవడం ద్వారా భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు.

స్థానిక సంస్థల బలోపేతంతో గ్రామస్వరాజ్యం సాకారం



వింజమూరులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలకృష్ణారెడ్డి



కొండాపురంలో గాంధీ, అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ అనూరాధ

వింజమూరు(ఉదయగిరి): స్థానిక సంస్థల బలోపేతంతో గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందని వింజమూరు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధుల ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడే గ్రామ స్వరాజ్యం వికసిస్తుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అందరూ పాటుపడాలన్నారు. తొలుత మహాత్మగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ గోపి శ్రీనివాస్, సర్పంచ్ నల్లగొండ్ల సృజన, వనిపెంట సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


•ఉదయగిరి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ మర్జుజా హుసేన్, ఈఓ కరీముల్లా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కొండాపురం : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, ఎంపీడీఓ ఆదినారాయణ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాలర్పించారు. అనంతరం మండలాధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు రవికుమార్, ఆనందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు మాధవరెడ్డి, లెక్కల వెంకటరమణయ్య, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.


వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వరికుంటపాడు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. జెడ్పీటీసీ ఆర్ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఓ శ్రీనివాసరావు, ఉపాధి ఏపీఓ మధుసూదన్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలలిత మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పల్లెలే దేశానికి వెన్నెముక అనే సూత్రాన్ని అనుసరిస్తూ గ్రామాల అభివృద్ధికి పంచాయతీ రాజ్ శాఖ ఎన్నో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోందని ఆమె పేర్కొన్నారు.



చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో..



ఉదయగిరిలో మాట్లాడుతున్న సర్పంచ్ సామ్రాజ్యం

త్వరలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల నిర్మాణం

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో త్వరలో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు టెలికామ్ అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ అనూష తెలిపారు. దుత్తలూరు, ఉదయగిరి, వింజమూరు మండలాల్లో సెల్‌టవర్ల నిర్మాణానికి స్థలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకు బీఎస్ఎన్ఎల్ సేవల విస్తరణలో భాగంగా కొత్తగా టవర్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. దుత్తలూరు మండలం మందాలనాయుడుపల్లి, తిమ్మాపురం, ఏరుకొల్లు, జలదంకి మండలం కేశవరం, కలిగిరి మండలం అనంతపురం, పెద్దఅన్నలూరు, వెంకన్నపాలెం, కొండాపురం మండలం మర్రిగుంట, శెట్టిపాళెం, వెలిగండ్ల, సీతారామపురం మండలం చింతోడు, దేవమ్మచెరువు, గుండుపల్లి, జయపురం, వరికుంటపాడు మండలం బొంగరాలపాడు, గొల్లపల్లి, కనియంపాడు, రామదేవులపాడు, విరువూరు, వింజమూరు మండలం జనార్దనాపురం, రాగిపాడు గ్రామాల్లో సెల్‌టవర్లను నిర్మించనున్నట్లు తెలిపారు.

అవగాహనతోనే ప్రకృతి విపత్తుల్లో రక్షణ

బిట్రగుంట: తీరంలో సంభవించే తుపాన్లు, సునామీలు, భారీ వర్షాల వంటి ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తీరప్రాంతవాసులు అవగాహన కలిగి ఉండాలని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ అన్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నెలో రాష్ట్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన దళం విపత్తులపై మాక్‌డ్రిల్, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ హాజరై మాట్లాడారు. తీరంలో తరచుగా సంభవించే తుపాన్లు, అరుదుగా సంభవించే సునామీ వంటి విపత్తులు, మత్స్యకారులు వేటకు వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదవశాత్తు పడవల్లో మంటలు వ్యాపిస్తే రక్షించుకునే విధానాలు తదితర అంశాలను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో కలిసి వివరించారు. వాతావరణపరంగా సున్నితమైన తీరప్రాంతంలో ముందస్తు జాగ్రత్తలు, రక్షణాత్మక విధానాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మధుసూదన్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి

కావలి: కాశ్మీర్ లోయలో ఉగ్రవాదుల దాడిలో బలైన పట్టణానికి చెందిన మధుసూదన్ భౌతికకాయాన్ని పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, గంధం ప్రసన్నాంజనేయులు, గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరు చిన్నపుల్లయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, పుల్లా శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరమ్మ, ఆత్మకూరు రాజేష్, ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహిళల రక్షణకు క్యూఆర్ కోడ్



అనుమసముద్రంపేట : మహిళల రక్షణకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్‌ను ఏఎస్‌పేట దర్గా ప్రధాన ద్వారం, పోలీసు అవుట్ పోస్టు వద్ద హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్‌రావు, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు గురువారం ఏర్పాటు చేశారు. ఎస్సై సైదులు ఆదేశాల మేరకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశామని వారు తెలిపారు. క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే తమకు వివరాలు తెలుస్తాయని, మహిళలు వినియోగించుకోవాలని కోరారు.

బీసీ వసతిగృహ విద్యార్థుల ప్రతిభ



షేక్ సలీమా

ఆత్మకూరు: పదోతరగతి ఫలితాల్లో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఏఎస్‌డబ్ల్యూఓ సీహెచ్ శ్రీదేవి గురువారం తెలిపారు. డివిజన్‌లోని పది వసతిగృహాల నుంచి 154 మంది పరీక్షకు హాజరుకాగా, 137 మంది ఉత్తీర్ణత సాధించారని, 89 శాతం ఫలితాలను నమోదు చేశారని వివరించారు. ఆత్మకూరు బీసీ బాలికల వసతి గృహం విద్యార్థిని షేక్ సలీమా 583 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. 29 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారని వివరించారు.

సతీష్‌రెడ్డికి శుభాకాంక్షలు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరుకు చెందిన డీఆర్డీఓ మాజీ చైర్మన్ గుండ్రా సతీష్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా గురువారం బాధ్యతలు స్వీకరించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మహిమలూరుతో పాటుగా పరిసర గ్రామాలకు చెందిన సతీష్‌రెడ్డి అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

సీతారామపురం: అయ్యవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని గురువారం నిర్వహించారు. 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణయ్య దంపతులను సత్కరించారు. తమను పూర్వవిద్యార్థులు గుర్తుంచుకుని సత్కరించడం సంతోషకరమని సన్మానగ్రహీతలు పేర్కొన్నారు.



కృష్ణయ్య దంపతులకు సత్కారం

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయం



ఆత్మకూరులో ఉగ్రదాడిని ఖండిస్తూ ముస్లింల ప్రదర్శన



అల్లూరు: అంబేడ్కర్ యువజన సంఘ ఆధ్వర్యంలో..



ఆత్మకూరులో బీజేపీ ఆధ్వర్యంలో..



ఉదయగిరిలో మౌనం పాటిస్తున్న నాయకులు



అనుమసముద్రంపేటలో బీజేపీ ఆధ్వర్యంలో..

ఉదయగిరి/ ఆత్మకూరు/ఆత్మకూరురూరల్/ అనుమసముద్రంపేట/అల్లూరు: కాశ్మీర్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఖండించారు. ఉదయగిరిలో పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో అశువుల బాసిన వారికి గురువారం నివాళులర్పించారు. ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేనతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరులో బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ నేతలు కుడుముల సుధాకర్‌రెడ్డి, కంది మల్లికార్జునరెడ్డి, నున్నా సంతోష్, వాసిపల్లి సుధాకర్‌రెడ్డి, టీడీపీ నేతలు తుమ్మల చంద్రారెడ్డి, కరటంపాటి సుధాకర్, ఆపస్ జిల్లా నాయకుడు పట్నం అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ముస్లింలు పార్టీలకతీతంగా ఉగ్రదాడిని ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి ఉగ్రదాడిలో అశువులు బాసిన వారికి నివాళులర్పించారు. అలాగే ఏఎస్‌పేటలో బీజేపీ మండలాధ్యక్షుడు చెంచులురెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అలాగే అల్లూరులోని పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజ్, నాయకులు పాల్గొన్నారు.

చెలరేగిపోతున్న గ్రావెల్ మాఫియా

అనుమసముద్రంపేట: మండలంలో కొండమీదకొండూరు గ్రామంలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. సర్వే నంబర్లు 130, 131, 132లోని కొండపోరంబోకు నుంచి గత వారం రోజులుగా రాత్రి వేళల్లో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. రెండు జేసీబీలు, 20 ట్రాక్టర్లతో ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లోని లేఅవుట్లకు గ్రావెల్‌ను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు స్థానికులు యత్నించగా టీడీపీ నాయకుల అండతో దౌర్జన్యాలకు దిగుతున్నారు. క్రమంలో కొండపోరంబోకులోని వందల ఏళ్లనాటి వృక్ష సంపదకు హాని కలగజేస్తుండడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల నాటి చింతచెట్టును సైతం నరికేసి ముక్కలుగా చేసి గ్రావెల్ మాఫియా అమ్ముకున్నట్లుగా స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఆత్మకూరు ఆర్డీఓ, మండల తహసీల్దారు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వేయడంతో పాటు చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గ్రావెల్‌ను తవ్వేయడంతో బయటపడిన చెట్ల వేర్లు